క్లుప్తంగా

నియామకం

తుక్కుగూడ: రంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా పూర్తిస్థాయి కమిటీని నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుద్దాల లక్ష్మీనారాయణ శనివారం వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యాక్షులుగా ధనడ వెంకటయ్య, పసూనూరి భిక్షపతిచారి, ఆగేటి సత్తయ్య, కసోజ్ విష్ణుమూర్తి, కమ్మరి శ్రీనివాసచారి, రంగా జంగమయ్యగౌడ్, మాధురి మానయ్య, విక్కరి వేణుగౌడ్, కుమార్, ప్రధాన కార్యదర్శులుగా అత్తపూర్ శ్రీనివాస్‌గౌడ్, తలగామ అంజయ్య, కార్యదర్శులుగా వందన, ప్రభాకర్‌గౌడ్, దుర్గపురం కుమార్, రాజు, కొండల్, భాస్కర్‌గౌడ్, రవి యాదవ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్, కోశాధికారిగా కొమరి నర్సింహాలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారికి ఆయన నియామక పత్రాలు అందజేశారు.

సాయిచంద్‌కు నివాళి



కందుకూరు చౌరస్తాలో సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్వర్గీయ తెలంగాణ గిడ్డంగుల చైర్మన్ సాయిచంద్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం కందుకూరు చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహా మాట్లాడుతూ.. సాయిచంద్ ఆట, పాటలతో జనాన్ని తెలంగాణ ఉద్యమం వైపు కదిలేలా చేశారని కొనియాడారు. అయనను ఆదర్శంగా తీసుకొని యువత అన్ని రంగాల్లో ముందుకు పోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ సంఘాల నాయకులు కె.జంగయ్య, రాములు, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో జెడ్పీ చైర్‌పర్సన్ పర్యటన

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం, నందుపల్లి, మన్సాన్‌పల్లి, రామచంద్రాగూడ, పెండ్యాల, ఉప్పుగడ్డ తండా, కేసీ తండా, గంగారం, మైలార్‌బాయి తండా, హర్షగూడ, మహేశ్వరం గ్రామాల్లో రూ.1.29 కోట్ల జెడ్పీ నిధులతో పలు అభివృద్ధి పనులను ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఎంపీటీసీలు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 43, వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 70, కాకర 42, బీర 35, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 28, క్యారెట్ 40, దొండ 18, ఆలు 35, ఉల్లి 37, గోకర 45, దోస 23, సొర 09, పొట్ల 18, అరటి 10, చిక్కుడు 65, అర్వి 35, మునగ 65, చిలగడదుంప 45, బీట్‌రూట్ 25, కీర 21, ఫ్రెంచ్ బీన్స్ 85, కాప్సికమ్ 65. ఆదివారం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

ఘనంగా హనుమాన్ పల్లకీసేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ అర్చకులు రఘుపతి శర్మ, రాఘవేంద్రచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో పూజలు కొనసాగాయి. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో జైకిషన్ జవార్, సుశీల దంపతుల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పలబట్ల పాండురంగం, దన్యన్, హరిహరణ్‌కుమార్, రఘునందన్‌రెడ్డి, మల్లారెడ్డి, నర్సింలు, శ్రీశైలంగౌడ్, యంసాని నర్సింలు, రఘుగౌడ్, ఆశన్నగౌడ్, రాఘవేందర్‌గౌడ్, లక్ష్మణ్, బచ్చన్న, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యాయం'

షాబాద్: అర్హులైన రైతులందరికీ ఆగస్టులోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని షాబాద్ కాంగ్రెస్ పార్టీ బీసీ మండల అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచిందన్నారు. మిగిలిన పథకాలన్నీ త్వరలో అందరికీ అందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు న్యా యం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. గత ప్రభుత్వాలు రైతులను పట్టించుకోలేదని విమర్శించారు.

వినాయక మండపం కూల్చివేత



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ, హిందూ సంఘాలు

- మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ శ్రేణులు, హిందూ సంఘాలు
- కమిషనర్, మేయర్, కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ధర్నా

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 28వ డివిజన్ సప్తగిరి కాలనీలో ఉన్న వినాయక మండపాన్ని మున్సిపల్ సిబ్బంది నేలమట్టం చేశారు. శనివారం విషయం తెలుసుకున్న బీజేపీ, హిందూ సంఘాలు పెద్దఎత్తున బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు. కమిషనర్, మేయర్, 28వ డివిజన్ కార్పొరేటర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. సప్తగిరి కాలనీవాసులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ధర్నాలో పాల్గొన్న బీజేపీ మహేశ్వరం నియోజవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ మాట్లాడుతూ.. హిందూ మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 28వ డివిజన్‌లోని సప్తగిరి కాలనీలోని పార్కు స్థలంలో వినాయక మండపాన్ని నిర్మించుకొని గత కొన్ని సంవత్సరాలుగా గణేశ్ నవరాత్రులు, దేవి నవరాత్రులు, మహా శివరాత్రి జాగరణలు వంటి పండుగలు, పూజలు కాలనీవాసులు కలిసి నిర్వహిస్తూ వస్తున్నారన్నారు. కాలనీవాసులపై కక్షగట్టి ఎవరూ లేని సమయంలో పోలీసులతో వచ్చి జేసీబీతో కూల్చివేయించడం దుర్మార్గపు చర్య అని ధ్వజమెత్తారు. దీనికి బాధ్యత వహించి కమిషనర్‌ను బర్తరఫ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండురోజులు గడువు ఇస్తున్నాం కూల్చివేసిన చోటనే వినాయకుడి మండపాన్ని తిరిగి నిర్మించాలని లేనియెడల పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో బీజేపీ ఎదుగుదలను చూసి కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు కుమ్మక్కై ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు శ్రీధర్‌రెడ్డి, ఇంద్రసేనా, శంకర్, బీజేవైఎం అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్‌రెడ్డి, గుర్రం మల్లారెడ్డి, సామ సంజీవరెడ్డి, నడికుడి యాదగిరి, రవినాయక్, శూరకర్ణారెడ్డి, జోరల ప్రభాకర్, నాగార్జున, శ్రీకాంత్‌గౌడ్, రవికాంత్‌గౌడ్, మంత్రి మహేశ్, విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ శ్రేణులు పాల్గొన్నారు.



రోడ్లపై నిలిచిన బురదనీటిని పరిశీలిస్తూ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయిస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- అధికారులతో కలిసి గుర్రంగూడ రోడ్ల పరిశీలన

బడంగ్‌పేట్: రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలు, కాలనీవాసులకు అందుబాటులోకి తీసుకొస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలో ఎమ్మెల్యే రోడ్లను పరిశీలించారు. గడ్డ ఎన్‌క్లేవ్, అరవింద్‌నగర్, శ్రీకృష్ణనగర్, మారుతీనగర్, ఆదిత్యనగర్ తదితర కాలనీల్లో ఆమె పర్యటించారు. పెండింగ్‌లో ఉన్న అల్మాస్‌గూడ టూ గుర్రంగూడ ప్రధాన రోడ్డును పరిశీలించారు. గడ్డం ఎన్‌క్లేవ్‌లో కొత్తగా చేపడుతున్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి మాట్లాడుతూ.. అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేసుకునేందుకు కృషి చేస్తున్నానన్నారు. పెరుగుతున్న జనాభాకు విస్తరిస్తున్న కాలనీలను దృష్టిలో పెట్టుకొని రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాల పునఃరుద్ధరణకు గత ప్రభుత్వ హయాంలో నియోజకర్గ అభివృద్ధి కోసం రూ.250 కోట్లు మంజూరు చేయించానన్నారు. రాజకీయ దురుద్దేశంతో అట్టి నిధులను అడ్డుకుంటున్నారని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విన్నవిస్తున్నానన్నారు. ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రఘు, డీఈఈలు యాదయ్య, జ్యోతి, ఏఈ వినీల్‌గౌడ్, బీఆర్ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మాజీ కౌన్సిలర్ సాయికిరణ్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, సిబ్బంది, పలు కాలనీవాసులు పాల్గొన్నారు.



మానసిక దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

అనాథలకు చేయూత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ దివ్యాంగులకు ఎస్‌కే ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో చేయూతనందించారు. ఆశ్రమంలో 150 మంది మానసిక దివ్యాంగుల నిరాశ్రయులకు ఆరు నెలలకు సరిపడా సుమారు రూ.5 లక్షల విలువచేసే నిత్యావసర సరుకులు అందజేశారు. బియ్యం, కందిపప్పు, నూనె, పిండి, ఇతర వంట సామగ్రి, వాటితో పాటు ఫ్యాన్లు, గ్రీజర్లు, మిక్సీలు, దుప్పట్లు, ఇతర వస్తులను ఉచితంగా అందజేశారు. అదేవిధంగా తుర్కయంజాల్‌లోని ఇందిరానగర్‌లో కిరణం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్‌హోమ్‌లోని సుమారు 50 మంది విద్యార్థులకు బుక్స్, బ్యాగులు, దుప్పట్లు, కంప్యూటర్లు, చెప్పులు, బూట్లు, బట్టలు, టిఫిన్ బాక్స్‌లు ఇతర విద్యా అవసరాల వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మహిళా శిశు సంక్షేమ శాఖ రంగారెడ్డి జిల్లా అభివృద్ధి అధికారి బల్ల పద్మజ రమణ విచ్చేసి అనాథ దివ్యాంగులకు, విద్యార్థులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు వై.నోబుల్‌రాజు, సెక్రటరీ కె.రాజశేఖర్, సిద్ధు, గిరి, సైదులు తదితరులున్నారు.

ఉద్యోగుల సమష్టి కృషి అవసరం

- మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి



డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి

మహేశ్వరం: ఆర్టీసీలో మరింత లాభాలు తీసుకొచ్చేందుకు సిబ్బంది, ఉద్యోగులు సమష్టి కృషి అవసరమని మహేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో లక్ష్యే లక్ష్యం ఛాలెంజ్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్, మే నెలలో ప్రీ పెయిడ్ ఈపీకే ఆదాయంలో ఉత్తమ ఫలితాలు తీసుకొచ్చిన డ్రైవర్లు, కండక్టర్లకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న ఆర్టీసీ డిపోలలో మహేశ్వరం ఆర్టీసీ డిపోకు ఉద్యోగులు, సిబ్బంది అధిక లాభాలు తీసుకురావడం అభినందనీయమన్నారు. కష్టించి పనిచేసే ఉద్యోగులు మహేశ్వరం ఆర్టీసీ డిపోలో ఉండడం సంస్థకు ఎంతో గర్వకారణమన్నారు. ప్రతి డ్రైవర్, కండక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది కష్టపడి పనిచేసి డిపో ఆదాయం పెంచి లాభాలు తీసుకురావాలని ఆయన సూచించారు. అంతకుముందు ప్రీ పెయిడ్ ఈపీకే ఆదాయంలో ప్రథమ బహుమతి జోడికి రూ.1001ల నగదు, ప్రశంస పత్రాలు, ద్వితీయ బహుమతి జోడికి రూ.751ల నగదు, ప్రశంస పత్రాలు, తృతీయ బహుమతి జోడికి రూ.501ల నగదు, ప్రశంస పత్రాలు అందజేశారు.

నేతాజీ పొదుపు సంఘానికి ఉత్తమ అవార్డు



నేతాజీ పొదుపు సంఘం సభ్యులకు జ్ఞాపికను అందజేస్తున్న శ్రీనివాసచారి

మహేశ్వరం: సమాఖ్య పొదుపు సంఘంలో సభ్యులకు రుణాలు సక్రమంగా ఇచ్చి, సకాలంలో వసూలు చేసినందుకు గాను మండల పరిధిలోని మన్సాన్‌పల్లి గ్రామ నేతాజీ పొదుపు సంఘం ఉత్తమ అవార్డు అందుకుంది. శుక్రవారం రాత్రి శంషాబాద్ మండల పరిధిలోని పాలమాకుల గ్రామంలో అభ్యుదయ సమాఖ్య 12వ వార్షిక మహా సభను సమాఖ్య సభ్యులు నిర్వహించారు. మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘంలో సుమారు 700 మంది సభ్యులు చేరగా, సుమారు రూ.2కోట్ల రూపాయలు జమయ్యాయని సంఘం సభ్యులు తెలిపారు. ఈ సభలో నేతాజీ పొదుపు సంఘం సభ్యులకు రుణాలిచ్చి, సకాలంలో సభ్యుల నుంచి వసూలు చేసినందుకు ఎక్కువ మంది సభ్యులను సంఘంలో చేర్పించారు. సభ్యులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించినందుకు సంఘ సభ్యులను అభ్యుదయ సమాఖ్య అధ్యక్షుడు చింతోజీ శ్రీనివాసచారి జ్ఞాపికను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అభ్యుదయ సహాయ సహకార సంఘాల సమాఖ్య పర్యవేక్షణాధికారి బాల్‌రాజ్‌గౌడ్, మన్సాన్‌పల్లి నేతాజీ పొదుపు సంఘం అధ్యక్షుడు అలువాల దయానంద్‌గౌడ్, పాలకవర్గ సభ్యులు కుమార్, మల్లేశ్, అయిలేశ్, శ్రీధర్, రాజేశ్, వెంకటేశ్, అంజయ్య, ఎండీ.హాజీ, ఎండీ.గఫూర్, పాండు, చింతోజు శ్రీనివాసచారి, నీరటి సిద్దులు, దయానంద్ గౌడ్, శ్రీధర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేశ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- గెలిపించిన ప్రజలను ఎమ్మెల్యే యాదయ్య మోసం చేశారు
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి



మొయినాబాద్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు



చేవెళ్లలో ఎమ్మెల్యే కాలె యాదయ్య దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మొయినాబాద్: బీఆర్ఎస్ కార్యకర్తలు కష్టపడి పని చేసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను గెలిపిస్తే కార్యకర్తలను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలిపించిన కార్యకర్తలకు ఒక్కమాట కూడా చెప్పకుండా ఎమ్మెల్యే యాదయ్య పార్టీ మారడం బాధాకరమన్నారు. ఎవరూ పార్టీ మారినా కార్యకర్తలు ఆత్మస్థైర్యం కోల్పోవద్దన్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలమంతా పనిచేస్తామన్నారు. భవిష్యత్‌లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని.. ఇప్పుడు వెళ్లిపోయినవారంతా అప్పుడు బాధపడే రోజు వస్తుందన్నారు. బీఆర్ఎస్‌కు త్వరలోనే మంచి రోజులు వస్తాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యువత విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహా, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రావూఫ్, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్, నాయకులు తిరుపతిరెడ్డి, సురేందర్‌గౌడ్, గణేశ్‌రెడ్డి, బిలాల్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారం ఎక్కడ ఉంటే అక్కడే ఉండే వలసవాది

చేవెళ్ల: అధికారం ఎక్కడ ఉంటే అక్కడ ఉండేందుకు పార్టీలు మారే వలసవాది ఎమ్మెల్యే కాలె యాదయ్య అని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, మినిమం వెజ్ బోర్డు మాజీ చైర్మన్ నారాయణలు అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో శనివారం వారు ఎమ్మెల్యే కాలె యాదయ్య బీఆర్ఎస్ పార్టీని మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడంపై ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంతో తన కుటుంబానికి మొత్తం పదవులు ఇప్పించుకొని పార్టీని వాడుకున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచి పోవటం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యేకు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలు, గెలుపు కోసం పనిచేసిన పార్టీ శ్రేణులకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఆయనకు ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం, ప్రజాపాలన ప్రభుత్వం అంటూ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా పాలన చేస్తున్నారని దీనిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఖచ్చితంగా మళ్లీ బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వానికి మంచి రోజులు వస్తాయని పార్టీలో ఉండే నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ మారే వారిని పోనిచ్చి పార్టీకోసం ఉన్నవారితో పార్టీని నిలబెట్టుకుందామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నాయకులు రాకేశ్, సందీప్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్ ఉన్నారు.

పత్తి పంటల పరిశీలన

కొత్తూరు: రైతులు పత్తి సాగులో వ్యవసాయ అధికారులు సూచించే మెళకువలను పాటించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్త సుధారాణి అన్నారు. ఆమె శనివారం మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పర్యటించి పత్తిపంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పంట సాగులో రైతులకు ఆమె పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. విత్తుకోవడానికి ముందు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అంతేకాకుండా సాగు తర్వాత చీడపీడల నివారణకు సేంద్రీయ ఎరువులను వినియోగించాలని కోరారు. రైతులు పాత పద్ధతులకు స్వస్తి చెబుతూ ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే ఖర్చు తక్కువ, లాభాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ముఖ్యంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయడంతో రైతులు ఆర్థికంగా బలపడతారని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ దీపిక, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి

రౌడీషీటర్లపై నిఘా



- అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు
- అనుమానితులను ప్రశ్నిస్తున్న పోలీసులు
- ఆకతాయిలపై ప్రత్యేక ఫోకస్

చాదర్‌ఘాట్: నగరంలో ఇటీవల కాలంలో పెరుగుతున్న హత్యలు, రౌడీషీటర్ల ఆగడాలను దృష్టిలో పెట్టుకొని నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సౌత్‌ఈస్ట్ జోన్ పోలీసులు నిఘాను మరింత కట్టుదిట్టం చేశారు. సౌత్‌ఈస్ట్ జోన్ పరిధిలోకి వచ్చే చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత వారం రోజుల నుంచి అర్ధరాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.

- అర్ధరాత్రి రౌడీలు, ఆవారాగాళ్లు, గంజాయి బ్యాచ్ మద్యం మత్తులో వీరంగం చేస్తున్న వారితో శాంతి భద్రతలకు విఘాతం కలగడమే కాకుండా హత్యలు, దొమ్మీలు, దోపిడీలు, స్నాచింగ్‌లు జరుగుతున్నాయని భావించిన పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను పక్కనబెట్టారు.
- పోలీస్‌స్టేషన్ పరిధిలోని హోంగార్డు మొదలు ఏసీపీ, డీసీపీ వరకు రాత్రిపూట ఈ తనిఖీల్లో పాల్గొననున్నారు.
- ప్రతిరోజూ రాత్రి 10 నుంచి 12 గంటల వరకు శుక్ర, శని వారాల్లో రాత్రి 10 నుంచి ఒంటి గంట వరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు.
- ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసుకొని అన్ని వైపులా నుంచి పోలీసులు చుట్టుముట్టి అర్ధరాత్రి సంచరించే అనుమానితులను తనిఖీ చేస్తున్నారు.
- పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్ల కదలికలపై దృష్టి పెట్టిన పోలీసులు.. వారిని స్టేషన్‌కు రప్పించి వారి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారు.
- రోజూ రౌడీషీటర్లు, తల్లిదండ్రులు లేదా, భార్యాపిల్లలు లేదా స్నేహితులతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి కౌన్సిలింగ్‌లో పాల్గొనాల్సి ఉంటుంది. ఏదైనా కేసులో ఇరుక్కుంటే కఠిన చర్యలు తథ్యమని వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు.
- కత్తులు, గంజాయి ప్యాకెట్లు, బ్లేడ్లు ఇతరత్రా మారణాయుధాలను కలిగి ఉండే వారిని అరెస్ట్ చేస్తున్నారు.
- బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్‌షాపుల వద్ద కూడా అర్ధరాత్రి నిఘా పెడుతున్న పోలీసులు అనుమానితుల కదలికలను గమనిస్తున్నారు. ప్రజలకు శాంతి భద్రతలు అందించడం సామరస్య పూర్వక వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా పోలీసులు ఈ కొత్త పంథాకు శ్రీకారం చుట్టారు.